

ఖైరతాబాద్‌లో కురిసిన వర్షానికి జలమయమైన ప్రధాన రహదారి

## మళ్లీ కురిసింది వాన

నగరంలో భారీ వర్షం
లోతట్టు ప్రాంతాలు
జలమయం
రోడ్లపైకి భారీగా
వర్షపు నీరు
వాహనదారులకు
ఇబ్బందులు



# హైదరాబాద్ వార్త

హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం, రాత్రి ఒక్కసారిగా వర్షం కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, పంజాగుట్ట, హైటెక్ సిటీ, యూసఫ్‌గూడ, షేక్‌పేట్, గచ్చిబౌలి, ఆర్‌సిపురం, రాజేంద్రనగర్, బండ్లగూడ, గోల్కొండ, నార్సింగి, పుప్పాలగూడ, మైలార్‌దేవులపల్లి, మణికొండ, గండిపేట్, షాద్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వచ్చి చేరడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో రెండురోజులపాటు మోస్తారు వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. (ప్రభాతవార్త - హైదరాబాద్)

## ఇమ్లీబన్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రోరైల్ పనులు చేపట్టాలి

### ఎంఐఎం శాసన సభ పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎన్‌విఎస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంఐఎం శాసన సభ పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ

చార్మినార్,అక్టోబరు 12 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ ఇమ్లీబన్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించాలని ఎంఐఎం శాసన సభ పక్ష నాయకులు, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం శాసన సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్ రెడ్డిని కోరారు. ఎంఐఎం శాసనపక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ ఎంఐఎం నాయకులతో బుధవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిబిటెడ్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ నగరంలో మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనులు పూర్తియ్యాయని, పాతబస్తీలో మాత్రం ఇంత వరకు మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు ప్రారంభం కాలేదని ఆయన ఎన్‌విఎస్ రెడ్డికి అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. పాతబస్తీలో మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని తమ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాతనగరంలో ఇమ్లీబన్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు కారిడార్ రెండు ప్రాజెక్ట్ పనులు నిర్మాణం కోసం 500 కోట్ల రూపాయలు మంజారు చేసిందని అక్బరుద్దీర్ ఓవైసీ ఎన్‌విఎస్ రెడ్డికి వివరించారు. ఇమ్లీబన్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల దూరం ఉన్న మెట్రో రైలు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ఆయన హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎన్‌విఎస్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎంకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనులు పూర్తియితే మెట్రో రైల్ స్టేషన్లు దగ్గరలో ఉండే ఫలకనుమా, జంగమ్మెట్, జహానుమా, షంషేర్‌గంజ్, చాంద్రాయణగుట్ట, వట్టెపల్లి, అలియాబాద్, అలీనగర్, గాంధీనగర్, సయ్యద్‌అలీచబూత్ర, ఛత్రినాక, లాల్‌దర్వాజ, శివగంగానగర్, శివాజీనగర్, శాలిబండ, మొగల్‌పుర, కాజీపుర, హారిబౌలి, గౌలిపుర, పంచమహల్, ఓల్టాహోటల్, మీరాలంమండి, ఎత్తేబార్‌చౌక్, దారుషిఫా, నూర్‌ఖాన్‌బజార్, పంజేషా ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు పాతబస్తీలోని చార్మినార్, ఫలక్‌నుమా, లాడ్‌బజార్ ప్రాంతాలకు వచ్చే ప్రజలకు అన్నివిధాల ఉపయోగం కలుగుతుంది.

## హైప్రొఫైల్ వ్యక్తులుగా నమ్మిస్తూ..



### యువతులకు వల • స్నేహంపేరుతో చాటింగ్‌లు

**డబ్బులు వసూలు చేసుకుని అకౌంట్స్‌బ్లాక్**
**ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో రిక్వెస్ట్‌లు**
**పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు**



హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త: సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అప్‌డేట్ దగ్గర్నుంచి ఓటిపి ఫ్రాడ్, ఓఎల్‌ఎక్స్, గిఫ్ట్ ప్యాక్ సిమ్ స్వాపింగ్ తదితర నేరాలు చేసిన మేసగాళ్లు.. ఇటీవల ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రాం కేంద్రంగా చేసుకుని అత్యధికంగా మోసాలకు పాల్పడుతున్నారు. సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండి, నలుగురిలో పేరు కలిగిన వ్యక్తులను మోసగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. వీరిపైర్లపై నకిలీఖాతాలు సృష్టించి, వారి ఖాతాలో ఉన్న ఫ్రెండ్స్ లిస్టును ఫేస్‌బుక్ ద్వారా సంప్రదించి వసూళ్లదందా చేపడుతున్నారు. సాధారణ వ్యక్తుల నుంచి అత్యున్నత సివిల్ సర్వెంట్ అధికారుల పేర్లతో కూడా నకిలీ ఖాతాలు వెలుగులోకి రావడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇటీవల ఈతరహా ఫిర్యాదులు సైబర్‌క్రైం పోలీసులకు అత్యధికంగా అందుతున్నాయి. సైబర్ నేరగాళ్ల అమాయకులకు ఏదో ఒక రూపంలో నిత్యం వలవిసురుతూ మోసాలు చేస్తున్నారు. వీటిలో యువతులు, మహిళలకు ఫేస్‌బుక్ ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడితే.. అంగీకరించిన తర్వాత వాట్సాప్ నంబర్లు మార్చుకుని స్నేహం పేరుతో ప్రేమికులుగా మారి మోపోవడం ఒకట్రైతే, ఏకంగా మన పేర్లపైనే నకిలీ ఖాతాలను సృష్టించి స్నేహితులు, బంధువుల నుంచి వైద్యం తదితర అత్యవసరాల పేర్లతో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు.

**ఇన్‌స్టాగ్రాంలో వల, 60మంది యువతుల నుంచి 4కోట్లు వసూలు**

ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయిలకు వలవేస్తూ.. 60మంది నుంచి రూ. 4కోట్లు వసూలు చేశాడు. ఓ యువకుడు. బాధితులు ఫిర్యాదుతో ఆ యువకుడిని హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజమండ్రికి చెందిన జోగడ వంశీకృష్ణ బిటెక్ పూర్తి చేశాడు. ఇన్‌స్ట్రాగ్రాంలో ఓఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి.. తనకుతాను హైప్రొఫైల్ వ్యక్తిగా అమ్మాయిలను నమ్మించాడు. అనంతరం అమ్మాయిలతో చాటింగ్ చేస్తూ చాలామంది యువతులు తన ఫ్రెండ్‌షిప్ కోసం తపిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చేవాడు. అలా 60మంది అమ్మాయిలను మోసం చేసి రూ. 4కోట్లవరకు దోచుకున్నారు. అమెరికాలో ఉండే ఓయువతి కూడా వంశీకృష్ణ చేతిలో మోసపోయింది. దీంతో ఆమె సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వంశీకృష్ణపై గతంలో రాచకొండ, ఈస్ట్‌గోదావరి, వెస్ట్‌గోదావరి, కాకినాడ, జోగులాంబ, గద్వాల్, నిజావరాబాద్, ఖమ్మం, భీమవరం, వైజాగ్, కరీంనగర్, విజయంవాడలో ఈతరహా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

**ఫేస్‌బుక్ పరిచయంతో 13లక్షలు మోసం..** ఇటీవల నగరానికి చెందిన ఓమహిళకు ఫేస్‌బుక్‌లో జర్మనీనుంచి డాక్టర్ అజయ్‌పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా అంగీకరించింది. ఫేస్‌బుక్ ద్వారా ఆమెతో స్నేహం పెరగడంతో వాట్సాప్ చాటింగ్ నిమిత్తం ఫోన్‌నెంబర్లు మార్చుకున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితులు గమనించిన సదరుమోసగాడు, జర్మనీ నుంచి నగలు, విలువైన వస్తువులు పంపుతున్నట్లు చెప్పి వాటి ఫోటోలు ఆమెకు పంపాడు. దీంతో నిజమే అనుకుని నమ్మడంతో మరుసటి రోజు ఇమ్మిగ్రేషన్ అధికారుల పేరుతో ఫోన్ రావడంతో వారు చెప్పినట్లుగా చేసి 13లక్షలు మోసపోయింది. ఈనకిలీ ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రాం అకౌంట్‌లను సమాజంలో కాస్త పేరున్న వ్యక్తులతోపాటు పోలీసు అధికారుల నుంచి ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారుల వరకూ మోసగాళ్ల నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లను సృష్టించి వారి ఫ్రెండ్స్ జాబితాలో ఉన్నవారిని డబ్బులు అడుగుతున్నారు.

## రైతులు ప్రకృతి వైఫరీత్యాలతో నష్టపోతున్నారు

### భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డా.ఎ.ఎస్.శ్రీనివాస్

సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త: రాష్ట్రంలో జరుగుతున్న ప్రకృతి వైఫరీత్యాల వల్ల జరిగే పంట నష్టానికి పరిహారం అందని ద్రాక్షలా మారిందని, ప్రతి ఏడాది ఆనేక రకాలుగా నష్టం జరుగుతున్న ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదని భారతీయ కిసాన్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డా.ఎ.ఎస్.శ్రీనివాస్ ఆరోపించారు. రాష్ట్రంలో సిఎం కెసిఆర్ రైతులను పూర్తిగా విస్మరించారని, మరొక వైపు రాజకీయ ప్రయోజనాల కోసం ఇక్కడి రైతులకు ఎన్నో చేశామంటూ దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు మరేన్నో చేస్తామని మోసం చేస్తున్నారని బుధవారం నాడిక్కడ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇటీవల 26 రాష్ట్రాల నుంచి వంద మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెపుతూ రైతు బీమా ఇస్తున్నామని ప్రకటించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పసల్ బీమా యోజన పథకం నుంచి తప్పుకోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు రైతులను తమ రాజకీయ క్రీడాల్లో పావులుగా వాడుకోరాదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు బీమా పథకాన్ని 57 సంవత్సరాల నుంచి 67 సంవత్సరాలకు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్ఫూర్తి సందేశం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్ 12, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి జయ జయహే తెలంగాణ గీతాన్ని స్వరాష్ట్రోద్యమ గాయత్రి మంత్రంగా ప్రవచించి నాలుగు కోట్ల నాలుకపై ప్రతిష్టాపన చేసిన ప్రముఖ ప్రజాకవి, లోకకవి డా.అందెశ్రీ తను రాసిన పుస్తకం నిప్పుల వాగు పుస్తకాన్ని గ్రంథాలయ పాఠకులకు పరిచయం చేయడానికి వచ్చారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కప్పాటి పాండురంగారెడ్డి అందెశ్రీకి స్వాగతం పలికారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్ఫూర్తి సందేశం ఇవ్వమని అందెశ్రీని చైర్మెన్ పాండురంగారెడ్డి కోరగా ప్రజాకవి అందెశ్రీ పాఠకులకు స్ఫూర్తి, సందేశాన్నిచ్చారు. అందులో భాగంగా జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి వినోదాన్ని దూరం పెట్టి కష్టపడితే ఖచ్చితంగా లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. భారతదేశం 120కోట్ల ప్రజల చూపులు తనవైపు తిప్పుకుని తెలంగాణ సాధన ఒక్క పక్క పలుచటి వ్యక్తి కేసీఆర్ వల్ల అయిందంటే అర్థం చేసుకోవాలన్నారు.

## విడుదల చేసిన ఖైదీలను తిరిగి జైల్లో పెట్టాలి



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పి.ప్రేమ్‌పావని

సైఫాబాద్, అక్టోబరు 12 ప్రభాత వార్త: బిల్కిస్‌బానో మహిళాపై అత్యాచారం చేసి ఆమె కుటుంబ సభ్యులను హత్య చేసి దోషులుగా తేలి జైలు శిక్ష అనుభవిస్తున్న 11 మందిని గుజరాత్ ప్రభుత్వం 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విడుదల చేయడం సిగ్గు చేటని భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు పి.ప్రేమ్‌పావని ఆరోపించారు. ఖైదీల విడుదల మొత్తం దేశానికే ప్రమాదకరమని బానోకు న్యాయం జరిగే వరకు మహిళా లోకం పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. బానోకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హిమాయత్‌నగర్‌లో సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన పౌరుల సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అత్యాచారాలు, హత్యలు వంటి ఘోరమైన నేరాలు చేసిన దోషులకు స్వేచ్ఛ నిస్తే దేశంలోని మహిళలు ఏలా సురక్షితంగా జీవిస్తారని ఆమె ప్రశ్నించారు. దేశంలో మహిళలకు రాజ్యాంగంపై నమ్మకం ఉందని న్యాయం కోసం చివరి వరసలో నిలబడిన మహిళకు కూడా రాజ్యాంగం ధైర్యాన్ని ఇస్తుందని చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసిన ఖైదీలను తిరిగి జైలులో పెట్టించాలని బానోకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడాల నళిని, ఎస్.ఛాయాదేవి, ఉపాధ్యక్షురాలు షాహనా, కార్యదర్శి రాధిక, శ్రీదేవి, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కోసం వెళ్లిన విద్యార్థిని అదృశ్యం



అదృశ్యమైన సాయిప్రియాంక (ఫైల్)

తార్నాక, అక్టోబర్ 12 ప్రభాతవార్త: పరీక్ష రాసేందుకు కాలేజీకి వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మినారాయణ కథనం ప్రకారం. అల్వాల్ ప్రాంతానికి చెందిన వికాస్ కుమార్తె సాయి ప్రియాంక(16) నాగోల్‌లోని లాలన హోమ్‌లో ఉంటూ తార్నాకలోని విశ్వ చైతన్య కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతోంది. ప్రియాంక పరీక్ష కోసం వెళ్లి తిరిగి హోంకు చేరుకొనలేదు. దీంతో హోం నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు గర్ల్ మిస్సింగ్ కేసు నమోదు చేసి ఆమె ఆచూకి కోసం అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వచ్చే ఎన్నికల నాటికి బీసీల రాజకీయ పార్టీ ఏర్పాటు



కార్యక్రమంలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, పల్లెరవికుమార్, ఉడుతల బాలకృష్ణగౌడ్

చిక్కడపల్లి, అక్టోబరు 12 ప్రభాతవార్త: ఓటు చైతన్యం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుందని, అందుకే వచ్చే ఎన్నికల నాటికీ బీసీలకు రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా బహుజనులకు రాజ్యాధికారం కలగానే మిలిగిపోతోందని అన్నారు. నూతన గౌడ సంఘం అధ్యక్షుడు ఉడుతల బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో బహుజన విప్లవ వీరుడు, సర్దార్ పాపన్న స్ఫూర్తితో తెలంగాణ బహుజన కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం(అలయ్ బలయ్) కార్యక్రమం బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీ సిఎం కావడమే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. బహుజనులందరూ సంఘటితంగా ముందుకు సాగినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బహజనులందరికీ తెలుసు, వారంతా ఐక్యమైతే తప్పకుండా రాజ్యాధికారం సాధ్యమని, కానీ ఆ దిశగా ప్రయత్నాలు మాత్రం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన కులాలన్నీ ఐక్యమై ముందుకు సాగితే తప్పకుండా బహుజన రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తి జరిగినట్టుగానే బహుజనుల కులాల్లో ఓటు చైతన్యం జరగాలన్నారు. బబీసీలకు ఓటు చైతన్యం వస్తేనే రాజకీయ పార్టీలు మనకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి పూర్వ చైర్మన్ స్వామిగౌడ్, చిన్న గౌడ్, టిఆర్‌ఎస్ నేత పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఆర్.సంతోష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేత పల్లె రవికుమార్, బిఎస్‌పి నేత సాంబశివంగౌడ్, ఆమ్ ఆద్మీపార్టీ నాయకురాలు ఇందిరాశోభన్, సంఘం ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఉడుతల బాలకృష్ణగౌడ్, సభా అధ్యక్షుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సలహాదారు వంగ రాములు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చర్లపల్లి కిరణ్‌గౌడ్, మచ్చ కొండల్, శివకుమార్, గాయనీ రాజకుమారి, గుండ్రాతి శారదగౌడ్, వై.అమృత తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయి

### డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



అడ్డగుట్టలో ఆసరా పింఛన్ల కార్డులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తదితరులు

అడ్డగుట్ట, అక్టోబర్ 12 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, దళితబంధు, రైతుబంధు వంటి పథకాలు ఆదర్శంగా నిలిచాయని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం అడ్డ గుట్టలోని బోయ బస్తీలో నూతనంగా మంజూరైన ఆసరా పింఛన్ల కార్డులను అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్, మారేడ్‌పల్లి తహశీల్దార్ కె. మాధవిరెడ్డి, టిఆర్‌ఎస్ యువ నేతలు రామేశ్వర్ గౌడ్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిం ద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, టిఆర్‌ఎస్ యువ నాయకులు కిషోర్ గౌడ్, కిరణ్, గంగాపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైరం కొండ యాదగిరి, టిఆర్‌ఎస్ నాయకులు పెండెం మనోహర్, వై.సత్తయ్య గౌడ్, ప్రవీణ్, దేవయ్య, మల్లేశ్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.



నగరంలో కురిసిన వర్షానికి రోడ్లపైకి చేరిన వర్షపు నీరు

## తెలుగుభాషను సులభంగా నేర్చుకొనేందుకు విస్తృత పరిశోధనలు జరగాలి

### జూలూరు గౌరీశంకర్



తేట తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గౌరీశంకర్, దయానంద్, శ్రీనివాసాచారి

రవీంద్ర భారతి, అక్టోబరు 12 ప్రభాతవార్త : మాతృభాష తెలుగు సంరక్షణలో భాగంగా తెలుగుభాషను మరింత సులభంగా నేర్చుకొనేందుకు విస్తృతంగా పరిశోధనలు చేయాల్సి ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బుధవారం రవీంద్రభారతి ప్రాంగణం, కళాభవన్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీలోని తన కార్యాలయంలో ఉపాధ్యాయుడు సిహెచ్.వెంకటేశ్వర్లు వ్రాసిన 'తేట తెలుగు' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ తెలుగుభాషకున్న 56 అక్షరాలను 36 అక్షరాలకు కుదించి భాషను సులభమార్గాన్న నేర్చుకునేందుకు ఒత్తులు, మహాప్రాణాలు లేకుండా గీతల లేదా గుర్తులు పెట్టుకుంటే పిల్లలకు సులభంగా అర్థమవుతుందని శోధించి ఈ పుస్తకం ద్వారా రచయిత బోధించారని అభినందించారు. అయితే ఈ మార్గం ఎంతమేరకు ఆచరణయోగ్యమో పరిశోధన చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్‌సిఇఆర్‌టి విభాగానికి చెందిన దయానంద్ మాట్లాడుతూ ఆంగ్లభాషకు అక్షరాలు తక్కువ ఉండడం, విద్యార్థులు ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాల ఇబ్బంది లేకపోవడంతో తెలుగుకంటే ఇంగ్లీష్‌ను సులువుగా నేర్చుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచారి, కె.పి.అశోక్ కుమార్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కాంచనపల్లి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



ఐటి కారిడార్‌లో గంజాయి విక్రయిస్తున్న నిందితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గచ్చిబౌలి, అక్టోబరు 12 ప్రభాతవార్త : గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. ఐటి కారిడార్ పరిధిలోని రెండు వేరువేరు ప్రాంతాల నుంచి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మొత్తం 323 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫరూఖాబాద్ జిల్లా కమల్‌గంజ్‌కు చెందిన యోగేష్ రాజ్‌పుత్(25) నగరానికి వచ్చి మల్లేపల్లిలో నివాసం ఉంటూ ఫ్లిఫ్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతను గంజాయి ప్యాకెట్లు విక్రయించడం ప్రారంభించాడు. మంగళవారం సాయంత్రం గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని క్యూసిటీ సమీపంలో గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తుండగా, సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు రాజ్‌పుత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద నుంచి 63 గ్రాముల 9 గంజాయి ప్యాకెట్లను, సెల్‌ఫోను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలోని గచ్చిబౌలి క్వైట్‌ల్యాండ్ విల్లాస్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఒడిస్సా రాష్ట్రం బరంపుర్ పరిధిలోని నారాయణపూర్‌కు చెందిన బింగి క్రిష్ణారెడ్డి(30) నగరానికి వచ్చి గచ్చిబౌలి పిజెఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేటు హాస్టల్‌లో పనిచేస్తున్నాడు. ఇతను గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తుండగా, మంగళవారం క్వైట్‌ల్యాండ్ విల్లాస్ సమీపంలో ఉండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 260 గ్రాముల బరువున్న 25ప్యాకెట్ల గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుల మీద కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ప్రతిభావంతుడైన కవి వనపట్ల సుబ్బయ్య

## - ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

**నాంపల్లి, అక్టోబరు 12, ప్రభాతవార్త :** దీర్ఘ కవితలు, ఇతర కవితా సంపుటాలు విరివిగా ప్రచురిస్తూ ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య అనతికాలంలో ప్రతిభావంతుడైన కవిగా పేరుపొందారని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు బుధవారం ఉదయం పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన వనపట్ల సుబ్బయ్యను ఆధునిక తెలంగాణ తొలితరం రచయిత, కవి బూర్గుల రంగనాథరావు పురస్కారం, 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రదానం చేశారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ పరిషత్తు ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై బృహత్ గ్రంథాలను వెలువరిస్తుందని, ప్రతీఒక్కరూ ఆశ్చర్యపడేలా తెలంగాణ సాంస్కృతిక సంపద సమాచార సేకరణలో వెలుగు చూస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా ఎల్లూరి శివారెడ్డి బూర్గుల రంగనాథరావు రేడియో ప్రసంగాల సంపుటిని ఆవిష్కరించారు. పురస్కార స్వీకర్త సుబ్బయ్య సాహితీవేత్తగా, రాజకీయవేత్తగా బూర్గుల రామకృష్ణారావు అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య, బూర్గుల లక్ష్మీకాంతరావు, ఆచార్య ఎస్వీ రామారావు, మంత్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.


పురస్కారంతో సత్కరిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, లక్ష్మీకాంతరావు తదితర అతిథులు

# ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తే గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుతారు : మొగులయ్య

**కంటోన్మెంట్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేస్తే ప్రయాణికులు సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేరుతారని పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య, (బిమ్లానాయక్) తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టేషన్‌లో సికింద్రాబాద్ డివిఎం అపర్ణ కళ్యాణి ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఆకట్టుకునేందుకు నిర్వహించిన ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆటపాటలతో ప్రయాణికులను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. ప్రైవేయిట్ వాహనాల్లో ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయన్నారు. ఆర్టీసీలో అన్ని అర్హతలు కలిగిన డ్రైవర్లు ఓపికతో డ్రైవింగ్ చేస్తారన్నారు. ప్రయాణికులను వారి వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు ఆర్టీసి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆర్టీసి ఎండి సజ్జనార్ నూతన విధానంతో సంస్థను అభివృద్ధి బాటలో తెచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్ స్టేషన్ మేనేజర్ గురు స్వామి, కంట్రోలర్లు పాండయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, చారి తదితరులు పాల్గొన్నారు.


ప్రయాణికులను ఆకట్టుకునే విధంగా అవగాహనలో మొగులయ్య, ఆర్టీసి డివిఎం అపర్ణ కళ్యాణి

# నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

## - సి.హెచ్.శంకర్ రావ్

**కంటోన్మెంట్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేయిట్ పరం చేసేందుకు బిజెపి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్ రావ్ డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద దక్షిణ మధ్య మజ్దూర్ యూనియన్ నిర్వహించిన నిరాహారదీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైల్వేలో ప్రైవేయిటీ కరణ, మానిటైజేషన్లను రద్దు చేయాలన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. పని ఉద్యోగుల పని గంటలను తగ్గించాలన్నారు. 18 నెలల డిఏ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు కామ్రేడ్ శ్రీనివాస్, నాయకులు ఉదయ భాస్కర్, శివకుమార్,అరుణ్ కుమార్, ఎసరోజినిరెడ్డి,మురళీధర్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నేత శంకర్ రావ్

# మహిళలు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి : రామరాజు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** మహిళలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూనే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అఖిల భారత మందిర్ ప్రబంధ్ అధ్యక్షుడు రామరాజు సూచించారు. ఇప్పటికే అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని సాంకేతిక రంగంలో కూడా ముందంజలో ఉండాలని చెప్పారు. బుధవారం నల్లకుంటలో స్ఫూర్తిభవన్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారబోయిన మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను కార్పోరేటర్ అమృతతో కలిసి ప్రారంభించి రామరాజు మాట్లాడారు. నేటి ప్రపంచీకరణ, కంప్యూటర్ యుగంలో మహిళలు తమ పిల్లలకు దేశ సంస్కృతి, సాంప్రదాయలు, దేశభక్తిని పెంపొందించాలని ఆయన సూచించారు. ప్రతి మహిళకు కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కో-ఆర్డినేటర్ శిరీషా, ఉపాధ్యక్షుడు సునీల్, సంయుక్త కార్యదర్శులు మోహన్‌నాయుడు, కృష్ణకుమార్, కోశాదికారి శ్రీనివాస్, అశోక్‌యాదవ్, భాగ్యలక్ష్మీతోపాటు ఆనేక మంది మహిళలు పాల్గొన్నారు.


కంప్యూటర్ కోర్సులు ప్రారంభిస్తున్న రామరాజు, చిత్రంలో అమృత, మధుసూధన్‌యాదవ్ తదితరులు

# సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు : మంత్రి తలసాని

**కంటోన్మెంట్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్ నియోజకవర్గం రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లకుంట ప్రాంతానికి చెందిన చంద్రకళ అనారోగ్యంతో బాధపడుతుంది. మంత్రి తలసాని చొరవతో ముఖ్య మంత్రి సహాయ నిధజ నుంచి మంజూరైన 2.50 లక్షల చెక్కును బుధవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో బాధితురాలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం

**వికారాబాద్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** ముదిరాజులు బీసీ -డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని, ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌కు సానుకూల తీర్పు రావడం జరిగిందని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రామన్నగారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కాసాని జ్ఞానేశ్వర్ చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ, ముదిరాజులకు విద్య, ఉపాధి రంగాలలో రిజర్వేషన్ కల్పించుటకు అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డిని ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఒప్పించి అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులు బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏ కు మార్పించి, జీ.వో నెంబర్ 15 ఫిబ్రవరీ 19, 2009లో ప్రభుత్వం ఇవ్వడానికి కృషిచేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ జీఓ నెంబర్.15 కు వ్యతిరేకంగా బీసీ-ఏ లో ఉన్న ఉపకులాలు హైకోర్టు ఆశ్రయించడం వల్ల జీవో నెంబర్ 15 చెల్లదని హైకోర్టు ప్రకటించడం జరిగిందన్నారు. హైకోర్టు తీర్పువల్ల మెజారిటీ ప్రజలకు జరిగే అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని సుప్రీంకోర్టులో 2010లో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులకు న్యాయం చేయాలని స్పెషల్ లీవ్ పిటిషన్ కాసాని జ్ఞానేశ్వర్ దాఖలు చేరని తెలిపారు. ముదిరాజుల ఆర్థిక స్థితిగతులపై ఒక సర్వే రిపోర్ట్ సమర్పించమని తెలంగాణ బీసీ కమిషన్ను సుప్రీంకోర్టు కోరినప్పటికీ, బీసీ కమిషన్ ముదిరాజుల స్థితిగతులపై సుప్రీంకోర్టులో రిపోర్టు ఇప్పటివరకు సమర్పించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాసాని జ్ఞానేశ్వర్ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ పై తుది తీర్పు మంగళవారం సుప్రీంకోర్టు వెలువరిస్తూ..బీసీ కమిషన్ కు, బీసీ ఉపకులాల కేటగిరి మార్పుపై సమగ్ర అధ్యయనం చేయాలని, ముదిరాజులకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడం శుభ పరిణామ మని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం పరిగి అధ్యక్షుడు అనంతయ్య, నవపేట్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాణయ్య, ముదిరాజ్ సంఘం వికారాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బిఆర్.శేఖర్, నాయకులు కోడి లక్ష్మణ్, రంగరాజ్, దుద్యాల వెంకటయ్య, జి.లక్ష్మణ్, శేఖర్, మంగ నాగయ్య ఖల్‌కోడ నర్సిములు, వెంకటయ్య సిద్ధులు రు కృష్ణ, బంటు వెంకటయ్య, బాబు, దోమ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం

**సైఫాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 'మానసిక అవగాహన నడక' ను పీపుల్స్ ప్లాజా నుంచి జలవిహార్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రామ్‌చందర్ మాట్లాడుతూ మానసిక సమస్యలు మనిషికి కనిపించకుండా డాక్టర్లకు అంతు చిక్కకుండా మనిషిని కుంగదీస్తూ రకరకాల వ్యాధులకు దారితీస్తుందన్నారు. మానసిక ఆరోగ్యం అంటే మనం బాగా ఉన్నాం అంతా సవ్యంగా ఉంది అనే అనుభూతి. మానసికంగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు బాగా చురుకుగా పనిచేస్తూ భయాన్ని దగ్గరకు రాకుండా ఉంచుతారని వారు సాధించిన దానిపట్ల సంతృప్తి చెందుతూ ఇతరుల పట్ల కూడా ఆదే భావన కలిగి ఉండాలన్నారు. వత్తిళ్ళ నుంచి బాధల నుంచి స్వేచ్ఛ పొంది ఆదర్శవంతంగా ఉండే స్థితేనని ఆయన చెప్పారు. ప్రతి మనిషి మానసిక ఆనందం పొందడానికి వ్యక్తి యొక్క మానసిక ఆరోగ్య స్థాయి తన గురించి తెలుసుకోవడం స్వయం, జ్ఞానం తన బలాన్ని బలహీనతలను గుర్తించడం వాటిపైన సానుకూల వైఖరి కలిగి ఉండటం, స్వయం నియంత్రణ, వ్యతిరేక ఆలోచనలు రాకుండా చూసుకోవడమే ముఖ్యమన్నారు. మంచి ఆలోచనలతో అందమైన జీవితాన్ని ఏర్పరుచుకోవాలని ఆయన కోరారు. ప్రతి నిత్యం శారీరక వ్యాయమాలు, ప్రాణాయామాలు జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. దీంతో వారు మానసిక ప్రశంసలు పొందుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎ.సుధాకర్, కోశాధికారి శ్రీపూజ, నాయకులు సుబ్బారాయుడు సంజీవరావు పాల్గొన్నారు.


అవగాహన నడక కొనసాగిస్తున్న డాక్టర్లు

# కెసిఆర్ కురుమలను మోసం చేసిండు


రాజ్‌గోపాల్‌రెడ్డికిమద్దతుగా సంఘీభావం తెలుపుతున్న కుమర సంఘం

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** మునుగోడు నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్ది కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డికి తెలంగాణ కురుమ సంఘం మద్దతుప్రకటించారు. తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొశిక శ్రీనివాస్‌రావుకురుమ, బన్నె బుచ్చప్ప, చీలంపల్లి సురేష్‌కురుమ, మాధారం కృష్ణకురుమలు మాట్లాడుతూ మునుగోడులో జరిగే ఉపఎన్నికల్లో రాజ్‌గోపాల్‌రెడ్డికి మద్దతుగా గ్రామ,గ్రామన తిరిగి ప్రచారం చేసి కురుమలు బిజెపికి ఓటు వేయాలని కోరనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తమ సామాజిక వర్గానికి అన్యాయం చేశారని కురుమసంఘం ప్రతినిధులు మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎగ్గేమల్లేశం స్వార్ధపూరితంగా వ్యవహరిస్తున్నట్లు తమ సామాజికి వర్గాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. రెండోవిడత గొర్రెల పంపిణిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయకుండా కేవలం మునుగోడు వారికే జీవాలను కేటాయించడం దారుణమన్నారు. ఉప ఎన్నికల దృష్ట్యా స్వార్ద రాజకీయాలకు పాల్పడుతున్న టిఆర్ఎస్ పార్టీని ఓడిస్తామన్నారు. బిజెపి అభ్యర్ది కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి గెలుపునకు కురుమసంఘం ఆధ్వర్యంలో శక్తివంచనలేకుండా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో దొడ్డిశ్రీనాథ్, ఉర్వేరాకేష్‌కురుమ కొటి ధర్మతేజ,ఆవుల వినోద్‌కుమార్, చిగుమళ్ల బాలగోపాల్, దేవర చంద్రశేఖర్ తదితరులుపాల్గొన్నారు

# రైల్వేగేటు సమీపంలో వర్షం నీరు చేరకుండా చర్యలు..!

**ఖైరతాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ రైల్వేగేటు ప్రాంతంలో వర్షం నీరు చేరకుండా జిహెచ్ఎంసి సిబ్బంది చర్యలు తీసుకుంటుంది. గత కొద్ది రోజులుగా సగం లారీ వరకు మట్టిని తొలగించారు. జిహెచ్ఎంసి అధికారులు అక్కడ మట్టి చేరకుండా కొంత కాలంగా మట్టిని తొలగిస్తున్నారని స్థానిక ప్రజలు, కొందరు వ్యాపారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ చిన్న పాటి వర్షం కురిసినా చెరువులా మారిపోయే దుస్థితి ఉండేది. ప్రస్తుతం అక్కడ పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. గతంలో రాకపోకలకు, వాహనదారులకు అనేక ఇబ్బందులు కలిగేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితినుంచి కొంత వరకైనా పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే కాలంలో ఎలాంటి వర్షాలకైనా మ్యాన్‌హోల్ నుంచి నీరు వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. కొంత వరకైనా అక్కడున్న విగ్రహం వద్ద గల మ్యాన్ హోల్స్‌లను శుభ్రం చేయ డమే కాకుండా, మట్టి తొలగించడం వంటి పనులు చేస్తున్నారు. దీంతో ఇక్కడి జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసి అధికారులు, ఇటు సిబ్బంది ముందుచూపుతో పనులు చేపట్టడాన్ని జనం హర్షిస్తున్నారు.

# వర్ధమాన సినీనటుడు ప్రియాంత్‌రావు అరెస్ట్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** వర్ధమాన సినీనటుడు ప్రియాంత్‌రావును జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమ పేరుతో వంచించి అత్యాచారంతోపాటు కులం పేరుతో దూషించాడంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రియాంత్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బాధితురాలు ఫిర్యాదు ప్రకారం..హిరో ప్రియాంత్‌కు ఓజూనియర్ ఆర్టిస్ట్‌కు పరిచయం ఏర్పడింది. పరిచయం అయిన రెండు నెలల తర్వాత ఆమెకు ప్రియాంత్ ప్రపోజ్ చేశాడు. అప్పటి నుంచి వరి ప్రేమ ప్రయాణం కొనసాగింది. ఈ క్రమంలో ఒకరోజు హైదరాబాద్ శివారులో రిసార్ట్‌కు తీసుకెళ్లి పెళ్ళి చేసుకుంటానంటూ నమ్మించి అత్యాచారం చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా శ్రీనగర్ కాలనీలోని కార్యాలయానికి తీసుకెళ్ళి పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేసినట్లు వెల్లడించింది. చివరకు గర్భం దాల్చడంతో నిందితుడు మొహం చాటేసినట్లు తెలిపింది. అబార్షన్ కోసం మెడిసిన్స్ ఇవ్వడంతో అనారోగ్యం పాలయ్యానని అంతేకాకుండా విషయం బయటకు చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడని బాధితురాలు పోలీసులకు తెలియజేసింది.

# లక్ష్మాపూర్‌లో వరిపంటపై క్షేత్రప్రదర్శన

**రామాయంపేట, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఎరువుల అభివృద్ధి సంస్థ మరియు వాల్‌మార్ట్ సహకారంతో రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో వరిపంటలో క్షేత్ర ప్రదర్శన మరియు అవగాహన కార్యక్రమం బుధవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ సైంటిస్ట్ మరళీమోహన్, మరియు మనిధీప్ మాట్లాడుతూ వరి పంటలో ముకనయంగా కాండం తొలుచు పురుగు ఆకు చుట్టు పురుగు ప్రభావం వల్ల దిగుబడిలో 20 నుండి 30 శాతం తగ్గే అవవాశం ఉన్నందున ప్రారంభ దశనుండే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం మరియు వేప సంవంధిత నూనేను పిచికారి చేయడం, తాడు లాగడం, పక్షి స్థావరాలను ఏర్పాటు చేదం ఈ పద్దతులన్నీ చేసిన తర్వాత మాత్రమే చివరి ప్రయత్నంగా రసాయన పద్దతిలో పురుగు యొక్క నివారణ చర్యలుచేపట్టాలని రైతులకు సూచించారు. కానీ రైతులు కేవలం రసాయన పురుగు మందులు అధికమోతాదులో వాడటం వల్ల నేల, నీరు, వాయు కాలుష్యంతో పాటుగా పిచికారీ చేసేటువంటి రైతుల యొక్క ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు ఉన్న నేపథ్యంలో రైతులు సూచించిన మేరకే పురుగు మందులు వాడాలన్నారు. కావున రైతులు పురుగు యొక్క తీవ్రతను ప్రారంభ దశలోనే గుర్తించి తగు మోతాదులో మందులు పిచికారి చేసినట్లయితే సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఎరువుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఎన్ఆర్ 15048 వరి పంటను పరిశీలించి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి వివరించడం జరిగింది.

# భవిష్యత్తులో లఘుచిత్రాలకు ఎంతో ప్రాధాన్యత

## - సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ

**చిక్కడపల్లి, అక్టోబరు 12, ప్రభాతవార్త :** భవిష్యత్తులో లఘుచిత్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆనందలహరి-మయూరి ఆర్ట్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో 'అలా జరిగింది' విజయోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, కళారత్న మల్లం రమమేశ్ అధ్యక్షతన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రామసత్యనారాయణ హాజరై చిత్రం దర్శకుడు రామడుగు వసంత్‌ను, ప్రసారకర్త నిస్సార్‌తో పాటు యూనిట్ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కరాటే గురువు చెల్లెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు దుస్తువుల అందజేత


అంగన్‌వాడీకేంద్రంలో గడ్డంశ్రీనివాస్‌యాదవ్

**గోషామహల్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** అంగన్‌వాడి కేంద్రాలల్లో చిన్నారులకు జిజిఎఫ్ ద్వారా చిన్నారులకు దుస్తువుల అందచేశారు. బుధవారం సేవక్‌నగర్‌లోని అంగన్‌వాడి కేంద్రాన్ని బస్తీ కమిటి యూత్‌వింగ్ పిలుపు గడ్డంగంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రంలో మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు జిజిఎఫ్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీకమిటి అధ్యక్షులు శ్రీనివాస్, సురేష్, రాజ్‌కుమార్, జిత్తు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో దుస్తుల పంపిణీ

**నిజాంపేట, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** నిజాంపేట మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోజున విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ మరియు పాఠశాల దాత ప్రముఖ సంఘసేవకుడు పంజా మహేందర్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో కూడిన నాణ్యమైన విద్య అభిస్తుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మరియు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు.

# మానవహక్కులు సామాజిక న్యాయ విభాగం కమిషన్ అధ్యక్షుడిగా సుక్కడానియెల్

**చిక్కడపల్లి, అక్టోబరు 12, ప్రభాతవార్త :** మానవహక్కులు సామాజిక న్యాయ విభాగం కమిషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ సుక్క డానియెల్ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మహేతబ్‌రాయ్ నియామకపత్రాన్ని ఢిల్లీలో అందించారు. కాగా మంగళవారం గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుక్కా డానియెల్ మాట్లాడుతూ మానవహక్కు ల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో కమిషన్‌ను పటిష్టపరచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా ఎవ్వరు అధైర్యపడొద్దు

## - ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**బొంరాస్‌పేట్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** వేరువేరు ఘటనలలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరామర్శించారు.బొంరాస్‌పేట్ మండల పరిధిలోని వడిచర్ల గ్రామం ఏనిమీదితాండ సర్పంచ్ బద్దీబాయి భర్తభీమ్లానాయక్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్ళి పరామర్శించిన అనంతరం అక్కడి నుండి ఎక్కచెరువుతాండ సర్పంచ్ కమ్లీబాయి తల్లి,తాలుక అధికారప్రతినిధి టీటీ రాములునాయక్ సోదరి సోమ్లీబాయి మృతిచెందిన విషయం తెలుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు.అనంతరం దుద్యాల్ మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి బిఆర్ఎస్ కార్యకర్త వెంకట్‌రాములు రోడ్డుప్రమాదంలో గాయపడినందున అయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చిన తనకు ఒక్క ఫోన్ చేయండి, ప్రతికార్యకర్తకు అండగా నేనుంటాను అని అయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, జడ్పీటీసి, ఎంపిపి, యువనాయకులు నరేష్‌గౌడ్, మహేష్, వడిచర్ల ఉపసర్పంచ్ కృష్ణ, దేశ్యానాయక్ ఉన్నారు.

# విఆర్‌ఎల సమస్యలపై వినతి

**బొంరాస్‌పేట్ :** రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య బుధవారం నాడు దుద్యాల్ మండలం లగచర్ల గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి విభాగం కార్యనిర్వహక అధ్యక్షులు శివకుమార్ తల్లి మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మండలానికి చెందిన విఆర్‌ఎలు తమ సమస్యలపై ఆర్ కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. విఆర్‌ఎలు గత 80 రోజులుగా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందు కృషి చేయాలని కోరారన్నారు.

# గౌడసంఘాల జేపీసీ ఏపార్టీకి మద్దతు ఇవ్వలేదు

## - గౌడ సంఘాల జేపీసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్



సమావేశంలో మాట్లడుతున్న నర్సాగౌడ్, సిద్దిరాములుగౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** మునుగోడులో 40వేలకు పైగా ఓట్లు ఉన్నా గౌడ కులస్తులకు టికెట్ ఇవ్వకపోగా కనీ సం బిసి కులాల వారికి టికెట్ ఇవ్వకపోవడం దారుణమని కావున గౌడసంఘాల జేపీసీ ఏ పార్టీకి మద్దతివ్వడం లేదని ఎన్నికల పేరుతో కులాన్ని పార్టీలకు తాక ట్టు పెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని తెలంగాణ గౌడసంఘాల జేపీసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునుగోడులో గౌడకులాలకు టికెట్ ఇవ్వకుండా అవమానించిన ప్రభుత్వం అన్ని కులాలకు వేల కోట్ల నిధులు కేటాయించి గౌడకులస్తులకు ఎలాంటి హామీలు, నిధులు ఇవ్వలేదని ఇది గౌడ్‌లను అవమానించడమేనన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు ఇచ్చిన గీత కార్పొరేషన్‌ను తొలగించి కనీసం గీత కార్మికులకు ద్విచక్రవాహనాలు ఇవ్వలేదన్నారు. అలాగే గౌడ ఆత్మగౌరవభవనం పనులు ప్రారంభం చేయకుండా గౌడకులాన్ని అన్నిరంగాల్లో అణిచివేస్తుంటే ఏఒక్క రోజు ప్రభుత్వాన్ని ప్రశ్నించని వారు వాళ్ల స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కులాన్ని గుంపగుత్తగా తాకట్టు పెట్టడమేంటని ప్రశ్నించారు. టిఆర్ఎస్‌కు మద్దతు తెలిపింది రెండు సంఘాలేనని 17సంఘాలు పాల్గొన్నాయని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. పూటకో పార్టీ మారుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలో చేరి పైరవీలతో పబ్బంగడుపుకునే వాళ్లు టిఆర్ఎస్ పార్టీకి గౌడకులస్తులు అందరూ మద్దతు తెలుపుతున్నారని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. మునుగోడు ఎన్నికల పేరుతో డబ్బులు తీసుకుని కులాన్ని తాకట్టు పెట్టాలని చూస్తే మునుగోడుగౌడ్‌లు చూస్తూ ఊరుకోరని అలాంటివారిని తరిమికొట్టాలని హెచ్చరించారు. ఈసమావేశంలో వర్కింగ్ చైర్మన్ బూర మల్సూర్‌గౌడ్, వైస్ చైర్మన్లు చంది శ్రీనివాస్‌గౌడ్, పటేల్ వెంకటేష్‌గౌడ్, ఛీఫ్ అడ్వైజర్ రాగుల సిద్దిరాములుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ జనగాం వెంకటేశ్‌గౌడ్, మాదగాని కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నగరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం దృశ్యం

# విఆర్‌ఏల నిరసనకు సిఐటీయూ నాయకుల సంపూర్ణమద్దతు

## -జిల్లా సిఐటీయూ నాయకులు బుస్స చంద్రయ్య

**బొంరాస్‌పేట్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో విఆర్‌ఏలు తమ సయస్యలను పరిష్కరించాలని 80 రోజులనుండి ధర్నా చేస్తున్నవారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిఐటీయూ నాయకులు బుస్స చంద్రయ్య అన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బొంరాస్‌పేట్ మండల తహసీల్దార్ కార్యలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న విఆర్‌ఎలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.బుధవారంతో 80వ రోజుకు చేరిన విఆర్‌ఏల రిలే నిరహర దీక్షలు.విఆర్‌ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పే స్కేల్‌ను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు.50సంవత్సరాల వయస్సు నిండిన వారందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని,కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగం కల్పించాలన్నారు.సీనియార్టిని బట్టి పదోన్నతులు కల్పించి వారి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం ప రిస్కరించాలని అయన కోరారు.సీఎం కెసిఆర్ అసెంబ్లీలో ఇచ్చినమాట ప్రకారం వారి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. వెంకట్‌రాములు, మోహన్, రాములు, రాజ్‌కుమార్, కిష్టప్ప, రాఘు, భీములు, భాగ్యమ్మ, పాల్గొన్నారు.

# ఎంటమాలజి సిబ్బందికి కిట్ల అందజేత

**బేగంబజార్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి ఎంటమాలజి సిబ్బందికి బేగంబజార్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ గొంటిశంకర్ యాదవ్ పరికరాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటమాలజి విభాగానికి చెందిన సిబ్బందికి వ్యక్తిగత పరికరాలను 10 వస్తువులతోకూడి కిట్‌ను అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి పరికరాలను అందజేస్తున్న కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్

# కోనాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణి

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** రామాయంపేట మండల పరిధిలోని కోనాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాడు విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చంద్రకళ, ఉపసర్పంచ్ దీపక్‌రెడ్డిల చేతుల మీదుగా ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏకరూప దుస్తులతో పాటు, చదువుకోవడాని కి పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, వారానికి మూడుసార్లు పోషకాహారమైన గుడ్లు లాంటివి ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తుందని, అందుకు విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. 20 సంవత్సరాలు కష్టపడి చుదువుకుంటే మిగతా జీవితకాలం సుఖంగా బ్రతకొచ్చని, అలా కాకుండా 20 సంవత్సరాల వరకు చదువుకోకుండా కాలయాపన చేస్తే జీవితకాలం మొత్తం కష్టపడాల్సిన అవసరం ఉంటుందన్నారు. కాబట్టి కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ కష్టపడనిదే ఏదీ సాధించలేమని, కష్టపడి చదివినట్లయితే ఏదైనా సాధించగలమన్నారు. విజయానికి ఒకే ఒక్క మార్గం మరొకసారి ప్రయత్నించడమేనని ఇది గుర్తుపెట్టుకుంటే అందరూ విజయాలు సాధించవచ్చు అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఆర్ మహేశ్వరి, జి. నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖాన ప్రారంభం : మంచిరెడ్డి



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి, చైర్‌పర్సన్ అనురాధ

**తుర్కయంజాల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ పరిధిలోని ఎన్ఎస్ఆర్‌నగర్ కాలనీలో 9వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి హరిత యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ దావఖానను ప్రారంభోత్స వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితధన్‌రాజ్‌గౌడ్, టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్తకుర్మా మంగమ్మ శివకుమార్, స్థానిక కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు కమిటీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి కమిషనర్ ఎంఎస్ఆర్ జ్యోతి, కౌన్సిలర్లు, వైద్యాధికారులు, మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభించాలని వినతి



కాలనీ అభివృద్ధి కొరకై వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**తుర్కయంజాల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు ఇంద్రమ్మ కాలనీవాసులు కౌన్సిలర్ కోశిక ఐలయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ త్వరలో సీసీ రోడ్లు ప్రారంభిస్తానని హామీనిచ్చారు. అదే విధంగా కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం కోసం ఐలయ్యతోపాటు కాలనీవాసులు చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ అతి త్వరలో కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం జరుపుతామని కాలనీ వాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ గౌడ్, రాజునాయక్, వేముల శంకర్, నల్లవెల్లి వెంకటేష్, మహేష్ గౌడ్, కాలనీ పెద్దలు కాలనీవాసులు, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ముందు జాగ్రత్తలతో ఆర్థరైటిస్ నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

**సైదాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ముందు జాగ్రత్త చర్యలతో ఆర్థరైటిస్‌ను నివారించవచ్చునని అవేర్ గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రి కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వి.వి.సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ ఆర్థరైటిస్ డే సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థరైటిస్‌కేసుల్లో 90 శాతం వయసుతో పాటే వస్తాయని అయితే కొన్నిసార్లు చిన్న వయస్సులో కూడా వస్తాయని అన్నారు. యూరిక్ యాసిడ్ ఎక్కువ ఉండడంవల్ల కూడా సమస్యలు వస్తాయని, ఆర్థరైటిస్ ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సపొందాలని అన్నారు. సరైన అహారం, వ్యాయామం, నిద్ర ఉండాలని, జంక్ ఫుడ్స్ తినకూడదని ఆయన సూచించారు. పురుషులలో కంటే మహిళల్లో ఆర్థరైటిస్ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని, వారిలో ఆస్టియోపోరోసిస్ ఉంటుందని, రుతుక్రమం, హార్మోన్లలో మార్పుల వల్ల ఎముకలు త్వరగా అరిగిపోతాయని, మృదులాస్థి పాడవుతుందని, దాని వల్ల మహిళల్లో సమస్య ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ అశ్విన్ కుమార్‌రెడ్డి, డాక్టర్ వివి సత్యనారాయణ, ఆసుపత్రి సిఓఓ సత్వీందర్ సింగ్ సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** డివిజన్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని మూసారాంబాగ్‌డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని సాయినగర్‌లో వారం రోజులుగా తలెత్తిన నాలా సమస్యలను సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు డిఇ ప్రదీప్, సైట్ ఇంజనీర్ ఏడుకొండలుతో కలిసి ఆమె పరిశీలించారు. నాలా సమస్య పనులను సిబ్బందితో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం డివిజన్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానిక కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణీష్‌యాదవ్, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని గోడ పత్రిక ఆవిష్కరణ

**తుర్కయంజాల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** సిఐటియు రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు డి.కిషన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల మూలంగా పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరిగిందని, కార్మికులకు కనీస వేతనాలు కూడా అనేక పరిశ్రమల్లో అమలు చేయకుండా కార్మికులను వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. కార్మికుల సమస్యలపై రాజీ లేకుండా పోరాడుతున్నామని ఈ నేపథ్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కొత్తూరులో జరిగే సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుర్రం జంగయ్య, పగిల్ల మధు, ప్రకాష్, మాల్యాద్రి, కృష్ణ , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ పార్కు స్థలాలను కాపాడడంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ విఫలం: కాంగ్రెస్

**సరూర్‌నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్కు స్థలాలను కబ్జా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి, కార్పొరేషన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డిలు ఆరోపించారు. కార్పొరేషన్‌లోని 24వడివిజన్ అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు సమీపంలోనున్న విశాఖనగర్‌లో కబ్జాకు గురైన పబ్లిక్ పార్కు స్థలాన్ని వారు సందర్శించారు. ఈ మేరకు వారు సదరు పార్కు స్థలంలో నిర్మాణం జరిగిన బేస్‌మెంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో విలువైన పబ్లిక్ పార్కులు ఆక్రమణలకు గురవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విశాఖనగర్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలం కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుర్తించిన అసోసియేషన్ వారు సదరు స్థలాన్ని కాపాడి చుట్టూ ప్రహరీగోడను నిర్మించాలని కార్పొరేషన్‌ను కోరినా అధికారులు మొక్కుబడిగా బోర్డులు పెట్టారే తప్ప కబ్జా నుండి కాపాడలేదని వారు విమర్శించారు. దీంతో 300వందల గజాలు ఉన్న స్థలాన్ని అధికార టిఆర్ఎస్ పార్టీ నేతలు కబ్జా చేసి బేస్‌మెంట్‌ను నిర్మించారని వారు వెల్లడించారు. స్థానిక టిఆర్ఎస్ కార్పొరేటర్ల అండదండలతోనే పార్కు స్థలాలు, ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని వారు స్పష్టం చేశారు. సాక్షాత్తు అధికార పార్టీ నేతలే పార్కు స్థలాలను కబ్జా చేస్తుంటే అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్కుస్థలాలకు రక్షణలేకుండా పోయిందనీ గతంలో పార్కు స్థలాలను రక్షించి ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన పాలకులు మాటలు నీటి మూటలయ్యాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పార్కు స్థలాలను రక్షించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు కోరారు.

## అనుమతిలేని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి : బాబు శ్రీనివాస్



డిసి జయంత్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

**మలక్‌పేట, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లో 5 అంతస్తుల భవన నిర్మాణం జరుగుతున్న విషయాన్ని సంబంధిత జిహెచ్ఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏ మాత్రం స్పందన లేదని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయంపై మలక్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జయంత్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే డిసి స్పందించి అనుమతిలేని అక్రమ నిర్మాణాలను ఆపివేయాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు. గతంలో గ్రేటర్ కమిషనర్, సంబంధిత టౌన్ ప్లానింగ్ ఎసిపి ఫయీమ్, సెక్షన్ అధికారి సునితలకు సైతం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా 70 గజాల స్థలంలో 5 అంతస్తుల భవన నిర్మాణం జరుగుతున్న సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, విష్ణుదేవ్, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పక్షానే మునుగోడు ప్రజలు: అందెల



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసిన అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** మునుగోడులో ప్రజలు బిజెపి పక్షానే ఉన్నారని మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ స్పష్టం చేశారు. ఉప ఎన్నిక జరుగుతున్న మునుగోడు నియోజకవర్గంలోని పగిడిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీల నేతలు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా నాంపల్లి మండల బిజెపి ఇంఛార్జి ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి వారికి కాషాయ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం అందెల మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికలో బిజెపి హవా ఉందనీ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. టిఆర్ఎస్, కాంగ్రెస్‌లు మద్యం, డబ్బులు పంచినా గెలుపు మాత్రం బిజెపిదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లోని ఫిస్తా హౌజ్‌కు నోటీసులు జారీ

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ఫిస్తా హౌజ్ హోటల్‌కు సరియైన పార్కింగ్ వసతి లేని కారణంగా నోటీసులు జారీ చేసినట్లు ట్రాఫిక్ సిఐ పార్థసారధి తెలిపారు. ఇప్పటికే ఫిస్తాహౌజ్ యజమాన్యానికి పలుమార్లు నోటీసులు జారీ చేశామని, స్పందించకపోవడంతో సరైన పార్కింగ్ లేకుండా నడిపిస్తున్న హోటల్ అనుమతి రద్దు చేయాలని జిహెచ్ఎంసి రాసినట్లు ఆయన తెలిపారు. సామాన్య ప్రజలతోపాటు, వాహనదారులకు అసౌకర్యం కలిగిస్తున్న వాణిజ్య సముదాయాలపై తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాతీయ రహదారికి ఇరు పక్కల ఉన్న వాణిజ్య సముదాయాల యజమానులు పార్కింగ్ వసతి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జరైన పార్కింగ్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



ఈస్ట్ ఆనంద్ బాగ్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** డివిజన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో ఆయన స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలసి కాలనీ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కుంటున్న రోడ్లు, డ్రైనేజీ, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, మంచినీరు తదితర వాటిపై కాలనీ వాసులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డివిజన్ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఇ లౌక్య, ఏఇ మదురిమ, శ్రీకాంత్, వర్క్ఇన్స్‌పెక్టర్ రజనీకాంత్, సంపత్, నాయకులు కిశోర్, భాస్కర్, ఇబ్రహీం, చందు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలి : మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** వర్షాల కారణంగా ప్రతిసారి భారీగా వరదనీరు రోడ్డుపై చేరుతుండడంతో అసౌకర్యం కలగకుండా శాశ్వత పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపడతామని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ డివిజన్ విజయపురికాలనీలో పలుశాఖల అధికారులతో కలిసి విజయపురికాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పైకాలనీల రోడ్డుపై ప్రవహించే వరదనీరు లోతట్టు ప్రాంతమైన విజయపురి రోడ్‌నెంబర్ 2 కాలనీలో వరద నీరు నిలుస్తుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు తనదృష్టికి తీసుకువచ్చారన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలనీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు దాదాపు రూ.2.50కోట్లు ఖర్చు అవుతుందని వెంటనే జిహెచ్ఎంసి కమిషనర్‌తో మాట్లాడి నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నగరంలో నాళాల అభివృద్ధికి రూ.1200కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. వివిఎంహోమ్ స్థలం ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని, మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో మాట్లాడి ఆ సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారం దయానంద్ గుప్తా, జోనల్‌కమిషనర్ పంకజ, డిసి హరికృష్ణయ్య, మురుకుంట్ల అరవింద్‌శర్మ పాల్గొన్నారు.

## మునుగోడు ప్రచారంలో ఉప్పల్ నేతలు

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** మునుగోడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉప్పల్‌కు చెందిన పలువురు పార్టీ నేతలు బిజీబిజీగా ఉన్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితోపాటు, పలువురు కార్పొరేటర్లు, ఇతర నేతలు గత ఐదు రోజులుగా మునుగోడు ప్రచారంలో మునిగిపోయారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, గద్దం సాయికిరణ్, రెవల్లి రాజు, రావుల బాలకృష్ణగౌడ్ తదితరులు పలు గ్రామాలలో పర్యటించి బిజెపికి ఓటు వేయాలని విన్నవిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డితోపాటు, మాజీ కార్పొరేటర్ మందమల్ల పరమేశ్వర్‌రెడ్డి తమ అనుచరగణంతో కలిసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పలువురు పార్టీ నేతలు గ్రామాలలో తిష్ట వేసి ఉదయం ప్రచారం,రాత్రి విందులతో బిజీబిజీగా ఉంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎన్నికల ప్రచారంలో తాము ఉంటున్నామని చెబుతూ నిత్యం పోటోలలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు.

## చిన్న చెరువులో చెత్తాచెదారం తొలగించండి : సిపిఎం నాయకులు



చెత్తాచెదారం తొలగించాలని విన్నవిస్తున్న ఎర్రం శ్రీనివాస్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 12 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువులో వ్యర్థాల కారణంగా చెరువు పూర్తిగా కలుషితం అవుతుందని సిపిఎం కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్ ఆరోపించారు. చిన్న చెరువులో ఆటోలలో తెచ్చి చెత్త వేస్తున్నారని, దీనివల్ల చెరువువద్ద వాకింగ్‌కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువు చుట్టూ ప్రాంతాల్లో కాలుష్యం కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని, అధికారులు స్పందించి చెరువులో కలుషితవ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తుల ఆహ్వానం

**హయత్‌నగర్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఉచిత శిక్షణ కోసం అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తెలిపారు. ఎకౌంట్ అసిస్టెంట్(ట్యాలి)కి రెండు నెలల శిక్షణ కోసం అభ్యర్థులు బీకామ్ పాసై ఉండాలన్నారు. ఆటోమొబైల్-2 వీలర్ సిర్వీసింగ్ కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, నెల కాలపరిమితి కలిగిన టెలికాలర్ కోర్సుకు ఇంటర్మిడియెట్ పాసై ఉండాలన్నారు. 18-26 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు ఈనెల 17న ఉదయం 10 గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని సంస్థ కార్యాలయంలో అర్హతలకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్‌సెట్, రెండు పాస్‌పోర్టు సైజుఫొటోలు, ఆధార్ కార్డులో హాజరు కావాలని ఆయన సూచించారు. వివరాలకు 80196 26324, 9133908222, 9133908111, 9133908000 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## మునుగోడు బిఎస్‌పి నామినేషన్ కార్యక్రమంలో మహేశ్వరం నేతలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** మునుగోడు నియోజకవర్గం నుండి బిఎస్‌పి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శంకరాచారి నామినేషన్ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జి గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరలివెళ్ళిన బృందం చండూరు మండల కార్యాలయంలో శంకరాచారి నామినేషన్ అనంతరం ఆయనతో కలిసి ప్రచారం చేసింది. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆశయ సాధన కోసం బిఎస్‌పిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యార జగన్, భాగ్యరాజ్, లక్ష్మీదాస్, రజనీకాంత్, సుధాకర్, లక్ష్మీ ఆనంద్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కారణంగా ఇబ్బందులు పడకుండా చర్యలు : కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** వర్షం కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ డివిజన్‌లో ఆయన పర్యటించారు. డివిజన్ పరిధిలోని జికె కాలనీ నుండి ఆర్.కె పురం అంతయ్య కాలనీకి మధ్య ఉన్న డ్రైనేజీ వర్షం కారణంగా పూర్తిగా నిండి రోడ్డుపై ప్రవహించడంతో కాలనీ వాసులు, విద్యార్థులు, పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి ఆ సమస్యకు పరిష్కారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** బిజెపి నాయకులు కార్యకర్తలు సైనికుడిలా పని చేసే మునుగోడు ఎన్నికలలో విజయభేరి మోగించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే రాజేందర్ సూచించారు. మునుగోడు ఉపఎన్నికలలో భాగంగా నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ నివాసంలో బుధవారం ఉదయం అల్పాహారం సేవించి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ నాగోల్ డివిజన్‌లో నివాసం ఉంటున్న మునుగోడు నియోజకవర్గం ఓటర్లను గుర్తించి బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయానికి దోహద పడాలని, అదే విధంగా ప్రతి కార్యకర్త 15రోజులు మునుగోడులో బీజేపీ గెలుపు కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, చింతల సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

## హజారీ గ్రూప్స్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**సరూర్‌నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** హజారీ గ్రూప్స్ ఆధ్వర్యంలో రిటైల్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్‌లలో ఉచిత శిక్షణ కొరకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంఛార్జి శ్రావణ్ శర్మ తెలిపారు. సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలోని రోడ్ నెంబర్ 15లో ఉన్న సంస్థ కార్యాలయంలో 45 రోజుల పాటు మహిళలకు శిక్షణనివ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 18 నుండి 28 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మహిళలు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు వెంకటేశ్వర కాలనీలోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎన్నిసార్లు విన్నపాలు చేసిన సమస్యలు పరిష్కరించరా : కార్పొరేటర్ పవన్



జలమండలి అధికారులతో వాగ్వాదం చేస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** డ్రైనేజీ మంచినీటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నపాలు చేసిన ఎందుకు స్పందించడంలేదని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలి జనరల్ మేనేజర్ బలరాంతో కార్పొరేటర్ కలిసి సమస్యలు వివరించారు. గత సంవత్సర కాలం నుంచి ఒక్క నూతన డ్రైనేజీలైన్ సాంక్షన్ చేయడం లేదని, మరమ్మత్తు చేసే ప్రయత్నం కూడా చేయడంలేదనీ, గతంలో ఎన్ని సార్లు వినతి పత్రాలు అందజేసిన ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజ్ సమస్యలు తలెత్తుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనీ త్రాగునీటిలో డ్రైనేజీనీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పలవ్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణపనుల కోసం నెలల తరబడి గుంతలు తీసి వదిలేస్తున్నారని, కాలనీ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. డివిజన్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## మునుగోడులో బిజెపి గెలుపు ఖాయం : హరి



రాజగోపాల్‌రెడ్డి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లింగాల హరి

**సైదాబాద్, అక్టోబరు 12 ప్రభాతవార్త:** మునుగోడులో బిజెపి గెలుపు ఖాయమని మలక్‌పేట నియోజకవర్గం నాయకులు లింగాల హరిగౌడ్ అన్నారు. మునుగోడు బిజెపి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ మునుగోడు ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కానుందన్నారు. టిఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలనకు ప్రజలు చరమ గీతం పాడనున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా నరేంద్రమోడికి మద్దతు పలుకుతున్నారని, రాష్ట్రంలో కాషాయ జండా రెపరెపలాడడం ఖాయమన్నారు. మునుగోడు ఎన్నికల్లో తనకు చౌటుప్పల్ మండలం టౌన్ ఇంఛార్జిగా పార్టీ బాధ్యతలు అప్పగించడం జరిగిందని, బిజెపి గెలుపుకు తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

## పోషకాహారం, వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం : అజారుద్దీన్



కేర్ హాస్పిటల్‌లో మూవ్ యువర్ బాడీ పోస్టర్ విడుదల చేసిన అజారుద్దీన్

**మలక్‌పేట, అక్టోబర్ 12 ప్రభాతవార్త :** సరైన పోషకాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం కలుగుతుందని హెచ్‌సీఏ అధ్యక్షుడు అజారుద్దీన్ అన్నారు. వరల్డ్ ఆర్థరైటిస్ డే పురస్కరించుకొని బుధవారం మలక్‌పేట కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆసుపత్రి వారు రూపొందించిన మూవ్ యువర్ బాడీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం స్విమ్మింగ్, నడక, సైక్లింగ్, యోగా, మెడిటేషన్ సాధన చేయడం ద్వారా కండరాలపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. శరీర బరువు పెరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ హెచ్‌సీఓఓ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ భాస్కర్, లలిత్ మోహన్, డాక్టర్ నవీన్‌చంద్ పాల్గొన్నారు.